ఇంటర్ కెమిస్ట్రీలో 30% సిలబస్‌కు కోత

- జువాలజీ, ఫిజిక్స్‌లోనూ కొన్ని మార్పులు
- మనదగ్గర ఎన్సీఈఆర్టీని మించి ఇంటర్ సిలబస్
- తగ్గించాలని నిర్ణయించిన ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులపై భారాన్ని తగ్గించే దిశగా ఇంటర్‌బోర్డు అడుగులేస్తున్నది. సిలబస్‌ను తగ్గించేందుకు కసరత్తు చేస్తున్నది. ముఖ్యంగా కెమిస్ట్రీలో 30శాతం సిలబస్‌ను తగ్గించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. జువాలజీ సిలబస్‌ను సైతం సవరించాలని యోచిస్తున్నది. ఇంటర్‌లో ఎస్సీఈఆర్టీ (సీబీఎస్ఈ) సిలబస్ కన్నా.. తెలంగాణ సిలబస్సే అధికంగా ఉంది. మరీ ముఖ్యంగా ఇంటర్ కెమిస్ట్రీ సిలబస్ విద్యార్థులకు భారంగా మారింది. జేఈఈ, నీట్ వంటి జాతీయ పోటీ పరీక్షలకు రాసే వారు అధికంగా కష్టపడాల్సి వస్తున్నది. విద్యావేత్తలు సైతం పలుమార్లు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే 30శాతం సిలబస్‌కు కోతపెట్టనుంది. ఇప్పటికే తగ్గించాల్సిన పాఠ్యాంశాలను బోర్డు షార్ట్‌లిస్టు చేసింది. త్వరలో సబ్జెక్టు నిపుణుల కమిటీ సమావేశమయ్యి మార్పులు ఖరారుచేయనున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త సిలబస్ అందుబాటులోకి వస్తుంది. ఫిజిక్స్ ఎలక్ట్రానిక్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ని ప్రవేశపెట్టనుంది. కరోనాపై సైతం పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తున్నది.

జగిత్యాల జిల్లాలో పెద్దపులి సంచారం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లా కొండాపూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొడిమ్యాల మండలం కొండాపూర్‌కు చెందిన గుండుబాబు అనే రైతు పొలం వద్ద కట్టేసిన ఆవును రాత్రిపూట పెద్దపులి చంపి తిన్నది. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసిన గుండుబాబు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. రంగంలోకి దిగిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. భోళ్శెంచెరువు, సురేంపేట్, దమ్మయ్యపేట, రామకిష్టాపూర్, గోవిందరం గ్రామాల పరిధిలో పులి సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కదలికలు, ఆనవాళ్లు తెలిస్తే సమాచారం అందించాలని సూచించారు.

మున్సిపోల్స్ ఇప్పట్లో లేనట్టే!

- ముగిసిన మున్సిపల్ పాలక మండళ్ల కాలపరిమితి
- ఎన్నికల పనులు ప్రారంభించని రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఎటూతేలని 42% బీసీ రిజర్వేషన్ల అంశం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మున్సిపాలిటీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే అవకాశాలు కనిపించడం లేదు. అందుకు సంబంధించిన హడావుడి కానీ, కార్యక్రమాలు కానీ జరగడం లేదు. ఈ నెల 26తో రాష్ట్రంలో 128 మున్సిపాలిటీల్లో పాలకమండళ్ల గడువు ముగిసింది. ఆ వెంటనే ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమవుతుంది. అయితే, గ్రామ పంచాయతీల పాలక మండళ్ల కాలపరిమితి గత ఏడాది ఫిబ్రవరిలోనే ముగిసినా ఇప్పటివరకూ వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ మేరకు 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. డెడికేషన్ కమిషన్ నివేదిక వచ్చిన తర్వాతే 42% బీసీ రిజర్వేషన్ల విధానంపై స్పష్టత వస్తుంది. డెడికేషన్ కమిటీ నివేదిక సానుకూలంగా వచ్చినప్పటికీ, మొత్తం రిజర్వేషన్లు గరిష్ఠంగా 50 శాతానికి మించకూడదన్న నిబంధన కూడా ఉన్నదని రాజ్యాంగ నిపుణులు గుర్తుచేస్తున్నారు. దానిని అధిగమించాలంటే పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. ఈ తతంగం మొత్తం పూర్తిచేసుకుని, ఎన్నికలు నిర్వహించాలనుకుంటే మాత్రం ఇప్పట్లో సాధ్యం కాదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. లేదంటే పాత విధానంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే, బీసీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి ఉన్నదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉన్నది.

సిద్ధం కాని ఓటర్ల జాబితాలు

మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ అంశంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయలేదు. కనీసం సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. దీంతో మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన పనులు ఇప్పటివరకు చేపట్టలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు చెప్తున్నారు. కనీసం మున్సిపల్ పట్టణాల వారీగా ఓటర్ల జాబితా సిద్ధంగా లేదు. మున్సిపాలిటీల వారీగా ఎన్నికల అధికారులను ఏర్పాటు చేయడం, వారికి శిక్షణ ఇవ్వడం వంటి కార్యక్రమాలపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలూ తీసుకోలేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలను ఈ ఏడాది చివరి వరకైనా నిర్వహిస్తారా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. అయితే, మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణను మార్చి నెలాఖరు వరకు పూర్తి చేసి, కొత్త పాలక మండలి కొలువుతీరే విధంగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో ముచ్చటించినట్టు సమాచారం. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం రేవంత్ సర్కారుకు సవాలుగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

128 మున్సిపాలిటీల్లో 'ప్రత్యేక' పాలన

- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ
- ఎన్నికలపై నోరెత్తని సర్కారు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 128 మున్సిపాలిటీల్లో పాలక మండళ్ల గడువు ముగిసింది. దీంతో సోమవారం నుంచి ఆ పురపాలికల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి రానున్నది. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ జీవో 15 విడుదల చేశారు. నస్పూర్, కొత్తపల్లి మంచిర్యాల మున్సిపాలిటీలు కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైనందున 128 మున్సిపాలిటీల్లో ప్రత్యేక పాలన అమల్లోకి తెస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. ప్రత్యేక అధికారుల పాలన అమలయ్యే పురపాలికల్లో అభివృద్ధి కుంటుపడి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయే అవకాశం ఉన్నది. కొత్త నిర్ణయాలు జరగవు. పెండింగ్ బిల్లులు విడుదల కావు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రారు. రోజువారీ పర్యవేక్షణ లోపిస్తుంది. ఈ క్రమంలో రోడ్ల నిర్మాణాలు, పారిశుధ్య పనులు నిలిచిపోతాయి. పన్ను వసూళ్లలో ఆటంకాలు ఎదురవుతాయి. మున్సిపాలిటీల్లో పాలక మండళ్ల గడువు ముగియకముందే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం నోరెత్తడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 139 మున్సిపాలిటీలు, 16 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో 7 మున్సిపాలిటీలు మినహా మిగిలిన అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. ఈ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు చెప్తున్నారు. మున్సిపల్ ఎన్నికలపై రేవంత్‌రెడ్డి సర్కారు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది.

టీచర్ ఎమ్మెల్సీ దంగల్

- నిర్ణయాత్మకశక్తిగా గురుకుల, మాడల్, కేజీబీవీ టీచర్లు
- మరో వారంలో నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టీచర్ ఎమ్మెల్సీ పోరు ఆసక్తిరేపుతున్నది. పలు సంఘాల నేతలు పోటీలో దిగగా, ఓటర్లు ఎవరికి అండగా నిలుస్తారన్నది ఉత్కంఠ రేపుతున్నది. రెండు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో వారంలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలు సంఘాలు తమ అభ్యర్థులను ఖరారుచేయగా, ఆయా అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లా టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీపడే అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ స్థానం నుంచి మల్క కొమురయ్య (తపస్ –బీజేపీ), మహేందర్ రెడ్డి (పీఆర్టీయూ టీఎస్), ఇన్నారెడ్డి (సీపీఎస్ ఈయూ) నుంచి తలపడుతున్నారు. అయితే నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి బహుముఖ పోటీ నెలకొంది. ఈ స్థానం నుంచి పలువురు కీలక నేతలు పోటీచేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి (టీఎస్ యూటీఎఫ్), పింగిలి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్టీయూ టీఎస్), పులి సరోత్తంరెడ్డి (తపస్ –బీజేపీ), మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ (జాక్టో), హర్షవర్ధన్‌రెడ్డి (పీఆర్టీయూ తెలంగాణ) నుంచి ఖరారయ్యారు. టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లుగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ టీచర్లతోపాటు కేజీబీవీ, మాడల్ స్కూల్, గురుకుల టీచర్లు, జూనియర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, యూనివర్సిటీ టీచర్లు ఓటర్లుగా ఉన్నారు. ఎన్నికల వేళ టీచరు సమస్యలను ఏకరువుపెడుతున్నారు. కొత్త డిమాండ్లను తెరపైకి తీసుకొస్తున్నారు.

టీచర్ల ప్రధాన డిమాండ్లు ఇవే..

- టీచర్ల ఏకీకృత సర్వీస్ రూల్స్, ఎంఈవో, జేఎల్, డైట్ పదోన్నతులు కల్పించడం.
- సీపీఎస్ రద్దు. పాత పింఛను పునరుద్ధరణ
- హెల్త్‌కార్డులు, కార్పొరేట్ దవాఖానాల్లో నగదు రహిత చికిత్స
- 12 ఏండ్ల సర్వీస్ పూర్తిచేసిన వారికి స్కూల్ అసిస్టెంట్, 24 ఏండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జీటీలకు గెజిటెడ్ హోదా కల్పించాలి.

పార్టీ గద్దెపై జెండా ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ గద్దెపై పార్టీ మండలాధ్యక్షుడు భూత శ్రీనివాస్, బీజేపీ గద్దెపై మండలాధ్యక్షుడు మాలోత్ లక్పతి నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. దీంతో విమర్శలకు దారితీసింది.

–వీర్నపల్లి

జాతీయ జెండాకు అవమానం

తెలంగాణ డిజిటల్ మీడియా ట్విట్టర్ హ్యాండిల్‌లో తలకిందులుగా త్రివర్ణ పతాకం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సాక్షిగా జాతీయ పతాకానికి అవమానం జరిగింది. తెలంగాణ డిజిటల్ మీడియా ట్విట్టర్ హ్యాండిల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఉన్న ఫొటోలో జాతీయ జెండాను తలకిందులుగా పెట్టి అవమానించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వ్యవహారాలను పర్యవేక్షించే డిజిటల్ మీడియా వింగ్ జాతీయ పతాకాన్ని అవమానించటంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేడ్చల్‌లో తలకిందులుగా జెండా..

మేడ్చల్ మున్సిపాలిటీలోని వివేకానంద విగ్రహం పార్కు వద్ద కాంగ్రెస్ నేతలు జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. అంతటితో ఆగకుండా జెండా తలకిందులుగా ఉందని గుర్తించి కిందకు లాగేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఎమ్మెల్యే ఎగురవేసిన జెండా వాలిపోయింది

చందుర్తి, జనవరి 26 : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణలో అపశృతి చోటుచేసుకున్నది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉదయం జెండా ఎగురవేశారు. ఆయన వెళ్లిపోయిన కొద్దిసేపటికే జాతీయ జెండా కింద వాలిపోయింది. బండపల్లి ఎస్సీ కాలనీలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఆవిష్కరణ అనంతరం జెండా కింద వాలిపోయింది.

చందుర్తిలోప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎగురవేసిన అనంతరం కింద వాలిపోయిన జాతీయ జెండా

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాల్సిందే..

- అంబేద్కర్ చిత్రపటం లేకుండా జెండా ఎగురవేసిన భువనగిరి శాసనసభ్యుడు
- క్యాంప్ ఆఫీస్ ఎదుట బీఆర్ఎస్, బీజేపీ, దళిత సంఘాల ధర్నా

భువనగిరి అర్బన్, జనవరి 26 : భువనగిరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేసిన తీరు ఆందోళనకు దారితీసింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం లేకుండా, జాతీయ పతాకాన్ని సరైన విధంగా ఏర్పాటు చేయకుండా అగౌరవ పర్చారని బీఆర్ఎస్, బీజేపీతోపాటు దళిత సంఘాల నాయకులు క్యాంపు కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేశారు. అంబేద్కర్‌ను, జాతీయ పతాకాన్ని అగౌరవపర్చిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, దళిత నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దళిత నాయకుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, మాజీ కౌన్సిలర్ రత్నపురం బలరాంతోపాటు పలువురిని అరెస్టు చేశారు. దళిత నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట పలువురు ధర్నా నిర్వహించారు.

ఇంటర్ ఇంగ్లిష్‌లో అదనపు ప్రశ్న

- ఫస్టియర్‌లో ఒకప్రశ్నను చేర్చిన బోర్డు
- ప్రాక్టికల్స్‌లో నో ఇంప్రూవ్‌మెంట్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో ఒక మార్పు చేస్తూ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఫస్టియర్ ఇంగ్లిష్‌లో ఒక ప్రశ్నను అదనంగా చేర్చింది. 2025 మార్చి పరీక్షల నుంచి ఈ మార్పు అమల్లోకి వస్తుంది. అయితే ఇది రెగ్యులర్ విద్యార్థులకే వర్తిస్తుంది. ఇది వరకు ఫస్టియర్ ఇంగ్లిష్‌లో ప్రశ్నల సంఖ్య 16 ఉండగా, తాజాగా 17కు పెంచారు. ఈ అదనపు ప్రశ్నను సెక్షన్–సీలో ఇస్తారు. ఈ సెక్షన్‌లో ఇది వరకు ఐదు ప్రశ్నలుండగా, తాజాగా ఆరు ప్రశ్నలిస్తారు. జతపరచండి (మ్యాచ్ ది ఫాలోయింగ్) ప్రశ్నను అదనంగా ఇవ్వనున్నారు. సవరించిన మాడల్ పేపర్లను అనుసరించాలని బోర్డు సూచించింది. ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌లో ఇంప్రూవ్‌మెంట్ ఉండదని బోర్డు ప్రకటించింది. విద్యార్థి ఫస్టియర్, సెకండియర్‌లోని అన్ని సబ్జెక్టులకు పరీక్షలు రాయాలనుకుంటే మాత్రం ఇంగ్లిష్ ప్రాక్టికల్ మార్కులను మెరుగుపరుచుకోవచ్చని (ఇంప్రూవ్‌మెంట్) బోర్డు వెల్లడించింది. ఇంటర్ ఇంగ్లిష్‌లో గతేడాది నుంచి ప్రాక్టికల్స్‌ను ప్రవేశపెట్టారు. నిరుడు ఫస్టియర్‌లో ప్రవేశపెట్టగా, ఈ ఏడాది సెకండియర్‌లో ప్రవేశపెట్టారు.

ఇంటర్‌లో జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్లు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ విద్యలో విద్యాప్రమాణాల పెంపు, పర్యవేక్షణకు జిల్లా అకడమిక్ మానిటరింగ్ విభాగాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో జిల్లాల్లో ముగ్గురు సభ్యులతో కూడిన విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు జూనియర్ లెక్చరర్లు, ఒక లైబ్రేరియన్‌ను అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్లుగా నియమించారు. వీరు జిల్లా, కాలేజీలవారీగా అత్యధికంగా గైర్హాజరవుతున్న విద్యార్థుల వివరాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు, స్టడీ అవర్స్ నిర్వహణ, స్లిప్‌టెస్టులు, ప్రీ ఫైనల్ పరీక్షల మూల్యాంకనం వంటి అంశాలపై దృష్టిపెట్టాలని సూచించారు.

వరంగల్ జిల్లా మూమునూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీలో నుంచి రోడ్డుకు అడ్డంగా పడిన ఇనుప స్తంభాల మధ్యలో ఉన్న మృతదేహాలు

మామునూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మృతులంతా మధ్యప్రదేశ్ కూలీలు

కరీమాబాద్, జనవరి 26 : వరంగల్ జిల్లా మామునూరులో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్‌కు చెందిన సంతోష్, అతడి భార్య చామాబాయి, కుమారులు ముకేశ్, కన్నా, కుమార్తెలు పూజ, కిరణ్ కొంతకాలంగా మామునూరులో కమ్మరి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొట్టకూటి కోసం తమ సామగ్రిని సర్దుకొని ఆదివారం మామునూరు నుంచి ఆటోలో వరంగల్ వైపు బయలదేరారు. అదే వైపుగా ఇనుప స్తంభాల లోడుతో వైజాగ్ నుంచి రాజస్థాన్‌కు ఓ భారీ లారీ వెళ్తున్నది. మామునూరు బెటాలియన్ సమీపంలోకి రాగానే లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ఉన్న ఇనుప స్తంభాలు అదే దారిలో వెళ్తున్న రెండు ఆటోలపై పడి నుజ్జునుజ్జు అయ్యాయి. ఒక్కసారిగా ఇనుప స్తంభాలు పడడంతో ఏడుగురితో ప్రయాణిస్తున్న ఆటోలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన సంతోష్ (48), పూజ (20), కిరణ్ (20), కన్నా (7) అక్కడికక్కడే మరణించగా, ముకేశ్, ఆటో డ్రైవర్లు షకీర్, సాగర్ గాయపడ్డారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను ఎంజీఎం ఎంజీఎం దవాఖానకు తరలించారు. గాయపడిన వారిని కలెక్టర్ సత్యశారదాదేవి, సీపీ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్యాధికారి పరామర్శించారు.

ఎన్‌డీఎస్‌ఏ ప్రామాణికత ఏమిటి?

మొదటిపేజీ తరువాయి...

చేయడంలో ఆ సంస్థకు ఎలాంటి అనుభవం లేదని విమర్శిస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఏ ఒక్క దానిపై చిన్న రిపోర్టును కూడా ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టుపై తాము ఎప్పుడో సూచించిన అంశాలనే మార్గదర్శకాల పేరుతో మధ్యంతర నివేదిక జారీ చేసిందని, అందులోనూ కొత్తగా ఏమీ లేదని పేర్కొంటున్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఎంతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నదని, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నదని నీటిరంగ నిపుణులు, ఇంజినీర్లు మండిపడుతున్నారు.

ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నదే 25 మంది

దేశవ్యాప్తంగా డ్యామ్‌ల భద్రతకు అనుసరించాల్సిన విధానాలను, నిబంధనలను ఎప్పటికప్పుడు సిఫారసు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లో వివిధ విభాగాల నిపుణులు, రాష్ట్రాల అధికారులతో ప్రత్యేకంగా ఎన్‌డీఎస్‌ఏని ఏర్పాటు చేసింది. అదేవిధంగా జాతీయ ప్రాజెక్టుల భద్రత ప్రమాణాలను ఏటా రెండు పర్యాయాలు (సీజన్‌కు ముందు, తర్వాత) నిర్ధారించేందుకు డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానళ్లను ఏర్పాటు చేయాలి. ఆ కమిటీల్లో జియాలజిస్టుతోపాటు సర్వే ఇన్వేస్టిగేషన్, డిజైన్, హైడ్రాలజీ, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్, మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, డ్యామ్ బ్రేక్ అనాలసిస్, ఎమర్జెన్సీ యాక్షన్‌ప్లాన్, డ్యామ్ కన్‌స్ట్రక్షన్, రిహాబిలిటేషన్ తదితర విభాగాల్లో సేవలందించే ఇంజినీర్లను, నిపుణులను నియమించాలి. ఈ అన్ని క్యాడర్లలో కలిపి కేంద్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు 85 పోస్టులను మంజూరు చేసింది. కానీ ప్రస్తుతం ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నది 25 మంది మాత్రమే. సమాచార హక్కు చట్టం ద్వారా స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఈ విషయాన్ని వెల్లడించింది. దీన్ని బట్టి ఇప్పటివరకు ఎన్‌డీఎస్‌ఏ కమిటీయే పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదని స్పష్టమవుతున్నది. అంతేకాకుండా ప్రస్తుతం ఎన్డీఎస్‌ఏలో ఉన్నవారంతా డైవర్షన్ మీద అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నవారే కావడం గమనార్హం.

మూడేండ్లలో ఒక్క రిపోర్టూ ఇవ్వలే

2021లో ఏర్పాటైన ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటివరకు కనీసం ఒక్క ప్రాజెక్టుకు సంబంధించిన నివేదికను కూడా ఇవ్వలేదు. ఎన్‌డీఎస్‌ఏలో ప్రధానంగా సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) అధికారులదే కీలక పాత్ర. అన్ని డ్యామ్ సేఫ్టీ ప్యానల్స్‌కు వారే నాయకత్వం వహిస్తున్నారు. కానీ, వారికి భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొన్న క్షేత్రస్థాయి అనుభవమే లేదని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ పనితీరుపై గత మూడేండ్లలో వచ్చిన నివేదికలే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు తర్వాత దేశంలోని అనేక భారీ ప్రాజెక్టుల్లో ప్రమాదాలు వాటిల్లాయి. కానీ, వాటిలో కేవలం 5 ఘటనలే తమ దృష్టికి వచ్చినట్టు ఎన్‌డీఎస్‌ఏ వెల్లడించింది. గత మూడేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు ముల్ల పెరియార్, తీస్తా, లోయర్ సుబంసిరి, సర్దార్ సరోవర్, తుంగభద్ర తదితర డ్యామ్‌లలో భద్రతా సమస్యలు తలెత్తినప్పటికీ ఎన్‌డీఎస్‌ఏ కేవలం రెండు ఘటనలపైనే ఎక్స్‌పర్ట్ కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిలో ఓ కమిటీని హిమానీనదాల ప్లాష్ ఫ్లడ్స్‌తో తీస్తా రివర్ ప్రాజెక్టులపై పడే ప్రభావాన్ని అంచనా వేసేందుకు, రెండో కమిటీని కాళేశ్వరం ఘటనపై సిఫారసులు చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ రెండు కమిటీలు ఇప్పటివరకు ఒక్క నివేదికను కూడా ఇవ్వలేదు. కాగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం డ్యామ్ పనులన్నీ పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సీడబ్ల్యూసీ పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయి. ఆ డ్యామ్‌కు సంబంధించిన డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని అనేక ఏళ్లుగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అయినప్పటికీ డయాఫ్రం వాల్ పునరుద్ధరణ కోసం సీడబ్ల్యూసీ గానీ, పీపీఏ గానీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారాన్ని చూపలేదు. దీన్ని బట్టే కేంద్ర సంస్థల అనుభవం ఏపాటిదో స్పష్టమవుతున్నది. అసలు పోలవరం డ్యామ్ డయాఫ్రం వాల్ ఘటనకు సంబంధించిన వివరాలే తమ వద్ద లేవని ఎన్‌డీఎస్‌ఏ చెప్పడం ఆ అథారిటీ పనితీరుకు నిలువెత్తు నిదర్శనం.

మధ్యంతర నివేదికలో పేర్కొన్నవన్నీ రాష్ట్ర ఇంజినీర్లు చెప్పిన అంశాలే

కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికలోని సిఫారసులన్నీ ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు ఇచ్చినవే కావడం గమనార్హం. మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ గత అక్టోబర్‌లో కుంగుబాటునకు గురైన వెంటనే 2 రోజుల్లోనే ఆగమేఘాల మీద ఎన్‌డీఎస్‌ఏ అధికారుల బృందం రాష్ట్రానికి విచ్చేసింది. బరాజ్ కుంగుబాటుపై ఎలాంటి పరీక్షలను నిర్వహించకుండా ఊహాజనిత అంశాలను పొందుపర్చి వారం తిరక్కముందే నివేదికను విడుదల చేసింది. మళ్లీ 4 నెలల తర్వాత బరాజ్ కుంగుబాటునకు కారణాలను అధ్యయనం చేసి, పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసేందుకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో 5 సభ్యులతో నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ నిరుడు మార్చి నెలలో రెండు పర్యాయాలు పర్యటించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది. ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీల నుంచి వివరాలను సేకరించింది. ఈ సందర్భంగానే ఆ నిపుణుల కమి